## కథ

# దేవుడితో పందెం

కె.వి.సుమలత

"వత్సా ఏమీ నీ కోరిక" చిద్విలాసంగా నవ్వుతూ వెంకటేశ్వరస్వామి తనను అడుగుతుంటే ఆనందంతో జగన్నాథరావుగారికి నోట మాట రావడం లేదు. తమాయించుకొని "స్వామీ! సడెన్‌గా మీరు ఇలా అడిగితే ఏం అడగాలో కూడా తెలియడం లేదు" అన్నారు.

"సరే, ఆలోచించుకుని అడుగు" అన్నారు స్వామి.

"స్వామీ, మీ దయవల్ల నేను బాగున్నాను. మంచి ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాను. సీతాదేవిలాంటి యిల్లాలు, ముత్యాల్లాంటి పిల్లలు ముగ్గురు. ఆడపిల్లకు పెళ్ళి చేసి అత్తారింటికి పంపాను. అల్లుడు బుద్ధిమంతుడు, సంపాదనపరుడు. దాని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. మగపిల్లలిద్దరూ పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కోడళ్లిద్దరూ కూతురులేని లోటు తెలియకుండా వెన్నంటే సపర్యలు చేస్తున్నారు. మనవళ్లతో హాయిగా కాలక్షేపం చేస్తున్నాను. ఇంకా నాకు కావలసింది ఏముంది? నేనంటే నా వాళ్లకు అపరిమితమైన ప్రేమ. మంచి జీవితాన్ని వారికి అందించాననే కృతజ్ఞతాభావం ఎక్కువ. ఏది కావాలన్నా అమరుస్తారు. అన్నీ ఉన్న నేను కోరుకోవడానికి ఏమీ లేవు స్వామీ" అన్నారు.

"బాగా ఆలోచించుకో" అన్నారు స్వామి మరో ఛాన్సు అన్నట్లుగా.

"తెలియడంలేదు స్వామీ" అన్నారు జగన్నాథరావుగారు.

"పిచ్చివాడా! ఎంతటి ప్రేమ అయినా నీవు ఆరోగ్యంగా ఉండి పరులమీద ఆధారపడనంతకాలమే. అనారోగ్యంతో మంచానపడితే ఏ ప్రేమ అయినా బలహీనపడుతుంది" అన్నారు స్వామి.

"లేదు స్వామీ నేను ఒప్పుకోను. నాకు ఒకరోజు జ్వరం వస్తేనే నా భార్య, పిల్లలు అల్లాడిపోతారు. అలాంటిది నేను మంచానపడితే నన్ను పట్టించుకోరా? అలా జరగదు స్వామీ, నా కుటుంబసభ్యుల గురించి నాకు తెలుసు"

"అలాగా! అయితే మనిద్దరం ఒక పందెం వేసుకుందామా మరి? ఈ రోజు నుండి సరిగ్గా నెల రోజుల తరువాత తిరిగి నేను కలుస్తాను. ఈ మధ్యలో నీవు పిలిచినా నేను రాను. గెలిచినా, ఓడినా నేను వచ్చేది మాత్రం నెలకే. ఒప్పందమేనా?" అన్నారు స్వామి.

"స్వామీ, మిమ్మల్ని గెలిచే భాగ్యం నాకు కలుగబోతుంది" అన్నారు ఒకింత గర్వంతో జగన్నాథరావుగారు.

"అదీ చూద్దాం! వెళ్తున్నా" అంటూ అనుమానంగా చూసారు స్వామి, విరమించుకుంటావా అన్నట్లుగా.

"ఊహూ..." అంటూ తల అడ్డంగా ఊపారు.

మరునాడు ఉదయం వాకింగ్ నుండి వస్తూనే నీరసంగా కుర్చీలో కూర్చుండిపోయి "జానకీ... జానకీ" అంటూ పిలిచారు. చేతిలో కాఫీ కప్పుతో "ఏమిటండీ అంత బిగ్గరగా పిలుస్తున్నారు" అంటూ వచ్చింది ఆవిడ.

"కాఫీ కోసం. కాస్త కళ్ళు తిరుగుతున్నాయి" అన్నారు. "అయ్యో, అదేంటండీ డాక్టర్‌గార్కి ఫోన్ చేయమంటారా?" అంది ఆదుర్దాగా.

"వద్దు. హడావుడి చేయకు. రాత్రి పెందలాడే భోజనం చేసానుగా. త్వరగా ఆకలి వేస్తున్నట్లుంది" అన్నారు.

"మీరు కాఫీ త్రాగి స్నానానికి వెళ్లండి. నేను టిఫిన్ తీసుకువస్తాను" అని వంటగదిలోకి దారి తీసిందావిడ. వెళ్తూ వెళ్తూ పేపర్ చదువుతున్న పెద్ద కొడుకు రాజేష్‌కి, వ్యాయామం చేస్తున్న చిన్న కొడుకు సురేష్‌కు "మీ నాన్నగార్కి కళ్లు తిరుగుతున్నాయట్రా" అని చెప్పింది. తల్లి మాట పూర్తికాకుండానే ఒకరి తరువాత మరొకరు తండ్రి దగ్గరకొచ్చారు. వీరి వెనుక పెద్ద కోడలు రమ, చిన్న కోడలు పద్మ వెళ్ళారు. మామగారి వద్దకు వచ్చారు. లాన్‌లో కూర్చున్న ఆయన్ని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసేసారు. లోలోపల ఆనందపడుతూనే వారి ప్రశ్నలకు "నాకేం పర్వాలేదు. కంగారుపడవద్దు" అని చెప్పి లోపలకు పంపించేసారు.

స్నానం చేసి రాగానే వేడి వేడి ఇడ్లీల మీద నెయ్యి వేసి కారప్పొడి వేసి తీసుకొచ్చింది జానకి.

చిన్నముక్క తుంపి నోట్లో పెట్టుకోగానే వికారంగా అనిపించింది. బలవంతంగా రెండో ముక్క నోట్లో పెట్టుకోగానే వాంతొచ్చినట్లుండి వాష్‌బేషిన్ వద్దకు పరుగెత్తారు.

ఉదయం త్రాగిన కాఫీతో సహా వాంతయిపోయింది. ఇంట్లో అంతా కంగారు పడిపోయారు.

ఫ్యామిలీ డాక్టర్‌గార్కి ఫోన్ చేసి పిలిపించారు. "అజీర్తి చేసి ఉంటుంది. ఏమీ కంగారుపడవలసిన పని లేదు" అని మందులు ఇచ్చి వెళ్ళారు డాక్టర్.

మేము సెలవుపెట్టి ఇంట్లోనే ఉంటామన్నారు కొడుకులిద్దరూ. జగన్నాథరావుగారు వద్దని కోప్పడి పంపించేసారు. అవసరమయితే ఫోన్ చేయండి అని మరీ మరీ చెప్పి వెళ్లారు.

కోడళ్ళయితే సరే సరి. 'అవి తాగుతారా మావయ్యా.. ఇవి తింటారా మావయ్యా' అంటూ ఊపిరాడనివ్వలేదు. జానకి మంచం దగ్గర నుండి కదలలేదు.

సాయంత్రం డాక్టర్‌గారు వచ్చి చూసారు. జగన్నాథరావుగారు అలాగే ఉందనటంతో మందులు మార్చి వెళ్ళారు. మరునాటికి కూడా ఆయన పరిస్థితిలో పెద్దగా మార్పేమీ లేదు. ఆహారం సహించటం లేదు.

డాక్టర్‌గారు టెస్టులు చేయిద్దాం హాస్పిటల్‌లో జాయిన్ చేద్దామన్నారు.

సిటీలోనే అతి పెద్దదయిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. అన్ని రకాల పరీక్షలు చేసారు. రిపోర్టులన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. అనారోగ్యం ఏమిటి అన్నది స్పష్టంగా తేలటం లేదు. మానసికంగా దేనికయినా బాధపడుతున్నారేమో అబ్జర్వేషన్‌లో ఉంచి చూద్దాం అని స్పెషల్ రూమ్‌లో ఆయన్ని ఉంచారు.

కూతురు సంధ్య, అల్లుడు రవి కబురు తెలిసి వచ్చేసారు. నాన్నగారిని పట్టుకొని ఏడుస్తున్న సంధ్యను ఎవరూ పట్టుకోలేకపోయారు. తనకేం కాలేదని ఊరు


కొమ్మని ఆయన సంధ్యను ఓదార్చారు. కొడుకులు, కోడళ్ళు ఎవరి ముఖాన నెత్తుటి చుక్కలేదు.

ఆరోగ్యంగా తిరిగే ఆయన ఎందుకలా మంచం పట్టారో, మనోవ్యధ దేనికో అర్థంకాక బుఱ్ఱ బద్దలు కొట్టుకుంటున్నారు అంతా.

అపుడే వారం కావొస్తున్నా ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడదం లేదు. జబ్బు అర్థంకాక డాక్టర్లు కూడా అయోమయంలో పడి ఎక్కడెక్కడినుండో స్పెషలిస్ట్‌లను పిలిపిస్తున్నారు. మళ్ళీ పరీక్షలు, మందుల మార్పులు జరుగుతూనే ఉన్నాయి. డబ్బులు మంచినీళ్ళలా ఖర్చవుతున్నాయి. జానకి హాస్పిటల్ రూమ్‌లో ఆయన ప్రక్కనే ఉంటోంది. సంధ్యను వదిలి అల్లుడు వెళ్ళిపోయాడు. మగపిల్లలు విరామ సమయమంతా ఆయన దగ్గరే ఉంటున్నారు. కోడళ్ళు ఇంట్లో పని ముగించుకొని హాస్పిటల్‌కొచ్చేస్తున్నారు.

వారం కాస్త పదిహేను రోజులయింది. ఆయన మాట్లాడే ఓపిక కోల్పోయారు. రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. మొదట్లో ఉన్న విచారం అందరిలో తగ్గింది. ఆయన పేరు మీద సేవింగ్స్‌లో ఉన్న డబ్బు ఖర్చయిపోయింది. రాజేష్, సురేష్‌లకు తండ్రి బ్రతుకుతాడన్న ఆశ పోయింది. ఇద్దరూ ఎవరు ముందు డబ్బు తీస్తారా అని మరొకరు తప్పుకుంటున్నారు. ఏ హాస్పిటల్‌కి రావడం కూడా తగ్గించేసారు. కోడళ్ళు పని ఒత్తిడితో కుదరడం లేదని రావడం తగ్గించేసారు. సంధ్య కూడా వెళ్ళిపోయింది మళ్ళీ వస్తానని. జానకమ్మ భర్తకు సపర్యలు చేయలేక నలిగిపోతోంది.

హాస్పిటల్‌కి చెడ్డపేరు వస్తుందని డాక్టర్స్ మూడు వారాల తరువాత- 'ఆయనకు ప్రాణాంతకమైన వ్యాధి వచ్చింది. నమ్మకం లేదు. ఇంటికి తీసుకువెళ్ళిపోండి. మందులతో నయం కాదు' అని తేల్చి చెప్పేశారు.



ఇంటికి తీసుకువచ్చాక ఆయన పరిస్థితి మరీ దారుణమయింది. మాట రాక పోయినా ఆయనకు అన్నీ తెలుస్తున్నాయి. మనవళ్ళను కూడా తన దరిదాపులకు రానివ్వడం లేదు ఎవరూ. పనమ్మాయి కూడా తన రూమ్‌లోకి వెళ్ళనని కోడళ్ళతో చెప్పడం వినపడింది.

జానకమ్మనే శుభ్రం చేస్తుంది. ఆవిడలో కూడా ఓపిక నశించిపోయింది. కొడుకులు, కోడళ్ళు చూసామా అన్నట్లు రోజులో ఒకసారి రూమ్‌లోకొచ్చి చూసి వెళ్తున్నారు.

ఇంటికి వచ్చాక సంధ్య వాళ్ళాయనతో కలిసి వచ్చి చూసింది.

సంధ్య తిరిగి వెళ్ళిపోతూ "అమ్మా! ఏదయినా జరిగితేనే కబురుచేయండి. మాటి మాటికీ లీవు దొరకడం కష్టమవుతుంది ఆయనకి" అన్నది.

ఆ మాట విన్న జగన్నాథరావుగార్కి గుండె ఆగినంత పనయింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురేనా ఈ మాటలు అన్నది అనుకున్నారు.

జానకి ఆయన ప్రక్కన కూర్చొని 'ఈయనకి నాకు ఋణం తీరిపోయింది. సేవలు చేయలేక చచ్చిపోతున్నాను. ఎన్నాళ్ళీ నరకం పడాలో' అనుకుంది స్వగతంలో. భార్యకయినా తన మీద ప్రేమ ఉంది అనుకున్న జగన్నాథరావుగార్కి నిజాన్ని జీర్ణించుకోవడం కష్టమయింది.

జగన్నాథరావుగారు మంచం ఎక్కి ఆ రోజుకి 29వ రోజు. ఆయన కొడుకులిద్దరూ గదిలోకి వచ్చి తల్లితో "అమ్మా! నాన్నగారు అటో ఇటోలాగా ఉన్నారు. సడెన్‌గా ఏమి జరిగినా మనం 6 నెలలు ఈ ఇంట్లో ఉండకూడదంటున్నారు. మనది పెద్ద కుటుంబం కదా ఇల్లు దొరకడం కష్ట

మవుతుంది. ఆయన్ని వరండాలో పడుకోబెడదామా" అన్నారు.

ఓ క్షణం గతుక్కుమన్నా నిజాన్ని గ్రహించి, జానకి సరేనంది.

అంత ఆస్తి సంపాదించి, అపారమైన ప్రేమను పంచి పిల్లలను పెంచుకున్న ఆయనకు ఆయన ఇంట్లోనే వరండాలో పక్క ఏర్పాటయింది.

ఈ రోజుకి తమ పందెం గడువు అయిపోతుంది. తనకు ఏ అనారోగ్యం లేదు. ఇదంతా దేవుడి లీల అని ఆయనకు అర్థమవుతుంది. కానీ సర్వాంతర్యామి అయిన ఆయనతో మూర్ఖంగా తన వాళ్ళ ప్రేమ గురించి పందెం కట్టడం ఎంత తప్పో ఆలస్యంగా అర్థమయింది ఆయనకి. ఇది ఇప్పుడు ఎవరికీ చెప్పలేడు. అర్థంకాని భాషలో చెప్పినా సంధిప్రేలాపన అనుకుంటారు. కానీ క్షణక్షణానికి తన పరిస్థితి విషమిస్తుంది. తన ప్రాణాలు గాలిలో కలిసిపోయేట్లుగా ఉన్నాయి. ఈ రోజు గడిస్తే బాగుండు అనుకుంటున్న ఆయనకి అది అసంభవమని తెలుస్తుంది. నేను ఓడిపోయాను అని దేవుడికి తెలియజేద్దామన్నా తన పిలుపు పెదవి దాటడం లేదు.

ఎక్కడో లీలగా ఏడుపులు వినబడుతున్నాయి. ఎక్కడో.. ఎక్కడో..

ఇదేమిటీ ఏమీ వినబడడం లేదు? తన ప్రాణం పోయిందా! తను చచ్చిపోయాడు. ఇక తను లేడు.. లేడు.

"ఏవండీ.. ఏవండీ.. ఏంటి కలవరిస్తున్నారు? వాకింగ్‌కి వెళ్ళలేదేంటి? ఒంట్లో బాగాలేదా" అన్న జానకి కేకలతో కళ్ళు తెరిచారు జగన్నాథరావుగారు. ఒళ్ళంతా చెమటలతో తడిచిన ఆయన నుదుటిమీద చెయ్యి వేసి "ఏమయిందండీ, ఏమిటిలా ఉన్నారు" అన్న మాటలతో ఆయన స్పృహలోకొచ్చారు.

ఇదంతా కలా? తనకేం కాలేదు. తను బ్రతికే ఉన్నాడు. ఎంత దారుణమైన కల? దేవుడు భవిష్యత్ తన కళ్ళకు కట్టినట్లు చూపాడు. తన కళ్ళు తెరిపించాడు. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యంగా ఉంటేనే ఎవరయినా ఆదరిస్తారు. ఎంతటి ప్రేమ అయినా తాత్కాలికమే. ఈ సత్యం అర్థం చేసుకోక తప్పదు. తనలో ఇంత అలజడి రేపిన ఉదయం జరిగిన సంఘటన ఆయనకు గుర్తొస్తోంది.

"ఏరా మంచి రోజు చూసి చెప్పు" అన్నారు జగన్నాథరావుగారు అప్పుడే వచ్చి కూర్చుంటున్న రంగారావుతో.

"రేపు మంచిదేరా. ఎందుకు" అంటూ లోపలకి చూస్తూ "అమ్మా! కాసిని మంచినీళ్ళివ్వు" అన్నారు.

మజ్జిగ గ్లాసుతో "తీసుకోండి అన్నయ్యా! ఎండలో వచ్చారు" అంటూ ఇచ్చింది జానకి.

త్రాగాక గ్లాసు తీసుకొని లోపలకు వెళ్ళిపోయింది.

"ఏంటి విశేషం?" అన్నారు రంగారావుగారు.

"పిల్లల పేరుమీద వీలునామా వ్రాయడానికి" అన్నారు జగన్నాథరావుగారు.

"అపుడే ఏం తొందర? బాగా ఆలోచించుకున్నావా?" అన్న రంగారావుగార్కి, "ఆలోచించుకోడానికేముందిరా, పిల్లలు ముగ్గురికి సమాన వాటాలు రాస్తాను. పెన్షన్ డబ్బులు చేతి ఖర్చులకుంటాయి. పిల్లల నీడలో హాయిగా ఉంటాము" అన్నారు జగన్నాథరావుగారు.

"ఎటు పోయి ఎటు వస్తుందో, నేను చేసిన తప్పు నీవు కూడా చేయకు. ఆస్తంతా పిల్లల పేరుమీద రాసి ఈ రోజు ప్రతీ పైసాకి వారి ముందు చేయి చాపడానికి నేను పడే ఇబ్బంది నీకు తెలియంది కాదు. ఆస్తి చేతికి వచ్చాక మమకారాలు దూరమవుతాయి. నీకు నా పిల్లల నిర్లక్ష్యం తెలుసుకదా" అన్నారు.

"అందరు పిల్లలు అలా ఎందుకు మారతారు? ఆస్తి రాసిస్తే కృతజ్ఞతాభావంతో మరింత ప్రేమగా ఉంటారు. నీ విషయంలో అలా జరిగిందని అందరికీ అలా జరుగుతుందా" అన్నారు జగన్నాథరావుగారు.

"నేను నీ మంచి కోరేవాడిని. నా పరిస్థితి నీకు రాకూడదని మరీ మరీ చెప్తున్నాను. అర్థం చేసుకో" అని అన్నారు రంగారావుగారు.

వారిద్దరూ చిరకాల మిత్రులు. ఆయన మిత్రుడి మాటలు కొట్టిపారేయలేదు. ఆలోచించసాగారు.

"నేను రేపు వస్తాను. ఈలోగా ఆలోచించుకో" అని వెళ్ళిపోయారు రంగారావుగారు.

ఆ రోజంతా ఆలోచిస్తూనే ఉన్న జగన్నాథరావుగార్కి కలత నిద్రలో వచ్చిన కలే దేవుడితో పందెం.

"నాన్నా! ఏమయింది?" అన్న కొడుకు రాజేష్ కేకతో ఈ లోకంలోకి వచ్చారాయన.

"ఏమీ లేదు" అని బాత్‌రూమ్ వైపె ళ్ళారు.

'తొందరగా రమ్మని' రంగారావుగార్కి ఫోన్ చేసి చెప్పారు టిఫిన్ చేసాక.

ఆయన రాగానే ఇద్దరూ కలిసి లాయర్‌గారింటికి వెళ్ళి ఆయన ఆస్తిని తన తదనంతరం భార్యాపిల్లలకు సమాన హక్కులుగా వీలునామా రాయించారు. అక్కడి నుండి మిత్రులిరువురు స్వీట్స్, పళ్లు కొనుక్కుని వృద్ధాశ్రమానికి వెళ్ళారు. వృద్ధాప్యం మనిషికి శాపం కదా అనుకున్నారు. కన్నవారి ప్రేమకు దూరమైన వారితో కాసేపు సంభాషించి ఇకనుండి ప్రతి వారం వద్దాము అని నిర్ణయించుకున్నారు. తేలికపడిన మనసుతో ఇంటిముఖం పట్టారు స్నేహితులిరువురు. జగన్నాథరావుగారి ముఖం వెలుగుతోంది పుడు.

## దటీజ్ ప్రియాంకా చోప్రా

టూపీస్ బికినీలోనైనా, హాట్ హాట్ సీన్లలోనైనా నటించడానికి అంతగా తనకి అభ్యంతరాలు లేవని సెలవిస్తోంది ప్రియాంకా చోప్రా. అయితే ఆ సీన్లు కళాత్మకంగా వుండాలిట. (అంటే ఏంటో?) అంతే కాదు- తను ఇంకా పదహారేళ్ల అమ్మాయిగానే ఫీలవుతుందిట. ఇప్పుడే కాదు, మరో ఇరవై యేళ్ల తర్వాతైనా కూడా తన వయసు పదహారు అనే భావిస్తుందిట ప్రియాంకా చోప్రా. ఎందుకంటే అలా ఫీలైతేనే తను ఉత్సాహంగా వుండగలదనేది ఆమె అభిప్రాయంట. మొత్తానికి ప్రియాంకా కనిపించేంత అమాయకురాలు కాదు కదండీ!

